ప్రజా ఉద్యమంగా కోటి సంతకాల సేకరణ

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రమేష్



కోటి సంతకాల గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న రాము తదితరులు

పెడన: పేదలపై భారాలు మోపుతూ ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రమేష్ (రాము) తెలిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు పార్టీ చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా చేపట్టాలని పిలుపు ఇచ్చారు. ఇందులో భాగంగా ప్రభుత్వ విధానాలపై దశలవారీగా చేపడుతున్న ఆందోళన కార్యక్రమాలు విజయవంతం చేయాలని కోరారు. ప్రతిగ్రామంలో రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించి ప్రజల నుంచి సంతకాల సేకరణ చేపట్టాలని సూచించారు. పేద ప్రజలకు వైద్య సేవలందించేందుకు జిల్లాకు ఒక ప్రభుత్వ కాలేజీని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తే కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటుపరం చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకునేందుకు కోటి సంతకాలు చేపట్టామని పేర్కొన్నారు. అనంతరం స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలసి రాము కోటి సంతకాల గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అక్టోబరు 28న నియోజకవర్గస్థాయిలో, నవంబరు 12వ తేదీన జిల్లా స్థాయిలో చేపట్టే నిరసన ర్యాలీల్లో ప్రతిఒక్కరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. నవంబరు 24 నాటికి సంతకాల సేకరణ పూరి చేయాల్సి ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఎంపీపీ ఎస్. మధుసూదన్‌రావు, కృత్తివెన్ను జెడ్పీటీసీ మైల రత్నకుమారి, పార్టీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు టి. శ్రీనివాసరావు, పార్టీ సీనియర్ నాయకులు కటకం ప్రసాదు, ఆర్. అచ్చుతరావు, ఎండి. ఖాజా, ముత్యాల నాగేశ్వరరావు, వైధాని వెంకటరాజు, నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



చల్లపల్లి-విజయవాడ రోడ్డులోని ఎన్టీఆర్ పార్కు వద్ద నిరుపయోగంగా ఉన్న బస్‌షెల్టర్



బస్ షెల్టర్‌ను వదిలి రోడ్డు పక్కన బస్సు కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

ఆక్రమణలో బస్‌షెల్టర్!

- నిరుపయోగంగా మారిన వైనం
- షెల్టర్ నిండా పోస్టర్లే
- రోడ్డుమీదే ప్రయాణికులు పడిగాపులు

చల్లపల్లి: చల్లపల్లి-విజయవాడ రోడ్డులోని ఎన్టీఆర్ పార్కు వద్ద రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన బస్‌షెల్టర్ ఆక్రమణలకు గురయింది. ఆక్రమణల కారణంగా షెల్టర్ వెనుక్కిపోయి మరుగున పడింది. ఫలితంగా ప్రశాంతంగా బస్సుల కోసం వేచి చూడాల్సిన ప్రయాణికులు దుమ్ము, ధూళి, ఎండ, వానల్లో కూడా రోడ్డు పక్కనే నిలబడి పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రయాణికులకు షెల్టర్ ఇవ్వాల్సిన ఆ షెల్టర్ లోపల రకరకాల పోస్టర్లు అంటించటంతో చివరికి అది పోస్టర్లకు షెల్టర్‌గా మారింది. దీనిని రోటరీ క్లబ్, లక్ష్మీపురం చక్కెర కర్మాగారం, దాతల సహకారంతో 2006లో నిర్మించారు. అప్పట్లో బస్‌షెల్టర్‌కు ఇరువైపుల ఖాళీ ప్రదేశం ఉండటంతో షెల్టర్‌లో ఉన్న ప్రయాణికులను చూసి బస్సులు ఆపేవారు. కాలక్రమంలో షెల్టర్‌కు చుట్టుపక్కల ఆక్రమణలు పెరిగిపోయాయి. ముందుభాగంలో ఒకపక్క తోపుడు బండ్లు, మరోఒకపక్క ట్రాఫిక్ పోలీసు పోస్టు, ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ మీటర్, చిన్నపాటి వర్షానికే రోజుల తరబడి నీరు నిల్వ ఉండటం వంటి కారణాలతో ఈ బస్ షెల్టర్ క్రమంగా ప్రయాణికులకు దూరమయ్యింది. చల్లపల్లి, నారాయణరావునగర్ ప్రాంతాల వాసులు చల్లపల్లి నుంచి కరకట్ట మీదుగా నడకుదురు, నిమ్మగడ్డ, వెలివోలు, శ్రీకాకుళం, లంకపల్లి, ఐలూరు, ఐనపూరు, భద్రిరాజుపాలెం, తోట్లవల్లూరు, దేవరపల్లి, చోడవరం, యనమలకుదురు ప్రాంతాలకు వెళ్లేవారు. కొడాలి, పామర్రు మీదుగా గుడివాడ, ఉయ్యూరు మీదుగా విజయవాడ వెళ్లేందుకు ఇక్కడే బస్సులు కోసం నిలబడతారు. బస్‌షెల్టర్ పూర్తిగా అపరిశుభ్రంగా మారటంతో ప్రయాణికులు బస్ షెల్టర్‌లోకి వెళ్లేందుకు ఇష్టపడక రోడ్డుపక్కనే నిలబడి బస్సుల కోసం ఎదురు చూస్తున్నారు. ఈ మార్గంలో అవనిగడ్డ ఆర్టీసీ బస్ డిపో నుంచి కరకట్టకు 18 బస్సులు నడుపుతున్నారు. ఒక్కో బస్సు రోజుకు మూడు ట్రిప్పులు చొప్పున రోజుకు 54 సార్లు ఈమార్గం నుంచి కరకట్ట మీదుగా విజయవాడకు వెళుతుంటాయి. అలాగే పామర్రు మీదుగా విజయవాడ, గుడివాడ ప్రాంతలకు కూడా బస్సులు ఇటే వెళతాయి. దీనినిబట్టి ఎంతమంది ప్రయాణికులు ఇక్కడ బస్సులు కోసం ఎదురు చూస్తుంటారో అర్థం చేసుకోవచ్చు. ఆక్రమణలు, అడ్డంకులు తొలగించి, లోపల శుభ్రపరిచి ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బాణసంచా అక్రమంగా తయారు చేస్తే చర్యలు



అక్రమంగా తయారు చేసిన టపాసులను స్వాధీనం చేసుకున్న రూరల్ పోలీసులు

గుడివాడరూరల్: దీపావళిని పురస్కరించుకుని బాణసంచా అక్రమంగా నిల్వ చేసినా, తయారు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని గుడివాడరూరల్ సీఐ ఎస్ఎల్ఆర్ సోమేశ్వరరావు తెలిపారు. జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు, డీఎస్పీ వి.ధీరజ్ వినీల్ పర్యవేక్షణలో మండలంలోని బొమ్ములూరులో శనివారం తెల్లవారుజామున కార్డెన్‌సెర్చ్ నిర్వహించి అక్రమంగా తయారు చేసిన నేల, ఉల్లిపాయ టపాసులను, వీటిని తయారు చేసేందుకు ఉపయోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అనుమతులు లేకుండా టపాసులు తయారు చేయడం చట్టవిరుద్ధమన్నారు. గుడివాడ తాలూకా సర్కిల్ పరిధిలోని గుడివాడరూరల్, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల్లో ఎక్కడైనా టపాసులు అక్రమంగా తయారు చేసి నిల్వ చేసినట్లు ప్రజలు గమనిస్తే వారి సమాచారం పోలీసులకు అందించాలని కోరారు. కార్యక్రమంలో తాలూకా ఎస్ఐ ఎస్.చంటిబాబు, గుడ్లవల్లేరు ఎస్ఐ పి.సత్యనారాయణ, ట్రెయినీ ఎస్ఐలు లోకేశ్వరి, కుమార్, పి.దుర్గా ఆంజనేయులు పాల్గొన్నారు.

పేర్ని నానిపై పోలీసులకు ఫిర్యాదు

అవనిగడ్డ: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మాజీ మంత్రి పేర్ని వెంకటరామయ్య (నాని) ఆయన అనుచురులపై టీడీపీ నాయకులు అవనిగడ్డ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. శుక్రవారం మచిలీపట్నంలో జరిగిన ఘటన పురస్కరించుకొని చర్యలు తీసుకోవాలని కోరుతూ టీడీపీ నాయకులు స్థానిక వంతెన సెంటర్లో ప్రదర్శన చేసి ఎస్ఐ శ్రీనివాస్‌కి ఫిర్యాదు చేశారు. ఏఎంసీ చైర్మన్ కొల్లూరు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆరోగ్యం, పరిశుభ్రత, పోషణపై శ్రద్ధ అవసరం



గన్నవరం: ఉంగుటూరు మండలం తేలప్రోలు సమీపంలోని ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం మహిళా సాధికారిత, ఫిర్యాదుల సెల్ ఆధ్వర్యంలో ఆరోగ్యం, పరిశుభ్రత, పోషణపై అవగాహనలో భాగంగా అతిథి లెక్చర్‌ను నిర్వహించారు. ముఖ్య అతిథి ప్రముఖ ప్రసూతి, స్త్రీ వ్యాధుల నిపుణురాలు డాక్టర్ సునంద మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో ఉన్నతంగా రాణిస్తున్నారని చెప్పారు. మహిళలు శక్తివంతంగా ఉండడం ద్వారానే వారి కుటుంబాలతో పాటు దేశం వేగంగా అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. ముఖ్యంగా మహిళలు ఆరోగ్యం, పరిశుభ్రత, పోషణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఆరోగ్యవంతమైన జీవనం కోసం సమతుల్యమైన పోషకాహారం తీసుకోవాలని చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్, ఆర్. భార్గవి తదితరులు పాల్గొన్నారు.

మద్యం బెల్టుషాపులను నియంత్రించాలి



ఐద్వా పతాకాన్ని ఎగురవేస్తున్న సంఘ నాయకులు

గన్నవరం: గ్రామాల్లో విచ్చలవిడిగా కొనసాగుతున్న మద్యం బెల్టుషాపులను నియంత్రించాలని ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు ముళ్ళపూడి కీర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక చింతపల్లి పాపారావు భవనంలో శనివారం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) మండల 16వ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా కీర్తి మాట్లాడుతూ.. గ్రామాల్లో బెల్టుషాపుల ద్వారా 24 గంటలు మద్యం విక్రయాలు చేస్తూ ప్రజారోగ్యాన్ని దెబ్బతిస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలు, చిన్నపిల్లలపై మానభంగాలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమవుతుందని విమర్శించారు. రాష్ట్రంలో 18 ఏళ్ల నిండిన ప్రతి ఆడబిడ్డకు నెలకు రూ.1,500 హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల అధ్యక్ష, కార్యదర్శులుగా సీహెచ్‌వీ.లక్ష్మి, కైలే స్వరూప, మరో ఏడుగురితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. తొలుత సంఘ పతాకాన్ని సీనియర్ నాయకురాలు మల్లేశ్వరి ఎగురవేశారు. జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు మల్లంపల్లి జయమ్మ, బుద్దవరం సర్పంచి బడుగు బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

సహనం, ప్రేమ నర్సింగ్ వృత్తికి ప్రధానం



అతిథుల నుంచి గోల్డ్ మెడల్ అందుకుంటున్న కె.సంధ్యారాణి

గన్నవరం రూరల్: సహనం, ప్రేమ నర్సింగ్ వృత్తికి ఎంతో ప్రధానమని హైదరాబాద్ ఫెర్నాండెజ్ ఫౌండేషన్ హెడ్ ఆఫ్ నర్సింగ్ సర్వీసెస్ సుమని అజయ్ అన్నారు. మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ సి.శోభనాద్రి సిద్ధార్థ కాలేజ్ అండ్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ యాన్యువల్‌డే సెలబ్రేషన్స్ శనివారం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జె.వందన అధ్యక్షతన ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సుమని అజయ్ మాట్లాడుతూ నర్సింగ్ విద్యకు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో గౌరవం ఉందని, నర్సుల సేవలు కోసం ప్రపంచం ఎదురుచూస్తుందన్నారు. రోగులతో సత్సంబంధాలు ఎక్కువగా నర్సులతోనే ఉంటుందని వారికి చిరునవ్వుతో సేవలందించాలని సూచించారు. నేడు వార్షికోత్సవం జరుపుకుంటున్న సిద్ధార్థ స్కూల్ అండ్ కాలేజ్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు మాట్లాడుతూ రోగులకు చిరునవ్వుతో సేవలందించాలన్నారు. నైటింగేల్ స్ఫూర్తితో రోగులను చూడాలని చెప్పారు. అనంతరం నాలుగు సంవత్సరాల నర్సింగ్ విద్యలో వివిధ విభాగాల్లో ఉన్నతంగా రాణించిన విద్యార్థులకు బంగారు పతకాలు, సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సిద్ధార్థ అకాడమి కోశాధికారి ఎస్.వెంకటేశ్వరరావు, నర్సింగ్ కళాశాలల కన్వీనర్ డాక్టర్ ఎస్.రాజగోపాల్, మెడికల్, నర్సింగ్ కళాశాలల ప్రిన్సిపాల్స్ డాక్టర్ డాక్టర్ ఎంవి భీమేశ్వర్, జె.వందన, కె.కళ్యాణి, డైరెక్టర్ డాక్టర్ సీవీరావు, ఏవో టీవీ సుబ్బారావు పాల్గొన్నారు.

విజయభాస్కర్‌కు గురుదేవోభవ పురస్కారం



విజయభాస్కర్‌కు పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

గుడివాడ టౌన్ : స్థానిక విద్యాలయ స్కూల్ డైరెక్టర్ బొప్పన వెంకట విజయ భాస్కర్‌కు గురుదేవోభవ పురస్కారం అందింది. ఇంటర్నేషనల్ టీచర్స్ డేను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ డెమొక్రటిక్ ఆధ్వర్యంలో శనివారం గుంటూరు ఎన్జీఓస్ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఈ పురస్కారం అందినట్లు విజయభాస్కర్ తెలిపారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ నుంచి ఈ పురస్కారం అందుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి. మోహన్‌రావు, రాష్ట్ర కార్యదర్శి సురేందర్‌రెడ్డి, కృష్ణాజిల్లా శాఖ సభ్యులు పాల్గొన్నారు.

కొత్త వ్యవసాయ విధానాలపై దృష్టి సారించాలి

కలెక్టర్ డీకే బాలాజీ



వరి పంటను పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

ఘంటసాల: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతులు మార్పు చెంది కొత్త వ్యవసాయ విధానాలపై దృష్టి సారించి ఆదాయం పెంచుకోవాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. న్యూఢిల్లీలో పీఎం ధనధాన్య కృషి యోజనను ప్రధాని నరేంద్రమోడీ శనివారం ప్రారంభించగా వర్చువల్ కార్యక్రమంలో ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం నుంచి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కృష్ణా జిల్లాలోని రైతులు సేంద్రీయ వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు నూతన వ్యవసాయ పద్ధతులను అవలంభిస్తూ ఆయిల్ పామ్, కొరమేను సాగు చేసి అధిక ఆదాయం పొందాలని రైతులకు పిలుపునిచ్చారు. జిల్లాలో పంట కాలువలతో సస్యశ్యామలంగా ఉంటూ వరి, మినుము పంటల సాగులో ముందంజలో ఉందన్నారు. ప్రభుత్వం కూడా ఆయిల్ పామ్ చెట్ల పెంపకం కోసం రాయితీలు అందిస్తుందన్నారు. ఘంటసాల మండలం చిట్టూర్పు, మొవ్వ మండలం చినముత్తేవి గ్రామాల్లో కొందరు రైతులు 10 సెంట్ల భూమిలో కొరమేను సాగు చేస్తున్నారన్నారు. కొరమేను మార్కెట్లో రూ.300 నుంచి రూ.350 వరకు ధర పలుకుతుందన్నారు. దీనికి పీఎంఈజీపీ పథకం కింద 35 శాతం రాయితీతో ప్రభుత్వమే దరఖాస్తులు స్వీకరించి రుణాలు కూడా మంజూరు చేస్తున్నందున రైతులు కొరమేను సాగుకు ముందుకు రావాలన్నారు. రైతులు సేంద్రీయ వ్యవసాయం చేసేలా ప్రోత్సహించేలా కృషి చేయాలని సూచించారు. ముందుగా కృషి విజ్ఞాన కేంద్రంలోని పంటల ఉత్పత్తి, మొక్కల రక్షణ, ఉద్యాన పంటల పెంపకం పై ఏర్పాటు చేసిన ఛాయా చిత్ర ప్రదర్శన తిలకించారు. అనంతరం కృషి విజ్ఞాన కేంద్రం ప్రాంగణంలో ఒక ఎకరా భూమిలో సేంద్రీయ పద్ధతిలో పండిస్తున్న ఎంటీయూ 1318 వరి పంటను జిల్లా కలెక్టర్ పరిశీలించి కేవీకే సమసన్వయకర్త డాక్టర్ డి.సుధారాణిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే జిల్లా కలెక్టర్ బాలాజీని కేవీకే ఆధ్వర్యంలో రైతులతో కలసి ఘనంగా సన్మానించారు. కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి, సర్పంచ్ బి.వెంకటేశ్వరమ్మ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఎస్.పద్మావతి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి చిన్న నరసింహులు, ఘంటసాల ఏఎంసీ మాజీ చైర్మన్ తుమ్మల చౌదరి బాబు, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ, వ్యవసాయ శాఖ డీడీ మనోహర్, ఏడీ మణిదర్, ఎంపిడివో డి.సుబ్బారావు, ఘంటసాల, చల్లపల్లి, మొవ్వ ఏవోలు డి.అనూష, కె.మురళీ కృష్ణ, బి.సురేష్ నాయక్, సర్వేయర్ డీటీ పి.శ్రీనివాసరావు, కేవీకే శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

షాపింగ్ ఉత్సవాన్ని విజయవంతంగా నిర్వహించండి

జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్



అధికారులతో మాట్లాడుతున్న జేసీ నవీన్

చిలకలపూడి(మచిలీపట్నం): సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై షాపింగ్ ఉత్సవాన్ని విజయవంతంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో సంబంధిత అధికారులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ నెల 13 నుంచి 19వ తేదీ వరకు జెడ్పీ కన్వెన్షన్ హాల్లో షాపింగ్ ఉత్సవాన్ని అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని కోరారు. జిల్లా అధికారులందరితో వాణిజ్య పన్నులశాఖ అధికారులు సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా వాణిజ్య పన్నులశాఖ, వ్యవసాయ, పరిశ్రమలు, మెప్మా, డీఆర్డీఏ, రవాణా తదితర ప్రధాన శాఖలు వారి పరిధిలో తగ్గిన జీఎస్టీలను బ్యానర్ల రూపంలో తెలియజేయటంతో పాటు సంబంధిత వ్యాపారులను సైతం భాగస్వామ్యులను చేయాలని తెలిపారు. తగ్గింపు కూపన్లు ఇచ్చి ప్రజలను ప్రోత్సహించాలని చెప్పారు. ఈ ఉత్సవాల నిర్వహణపై అధికారులందరికీ విధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశామని వెల్లడించారు. వారికి అప్పగించిన పనులను సజావుగా నిర్వర్తించాలన్నారు. ఈ షాపింగ్ ఉత్సవానికి పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చే అవకాశం ఉన్నందున జెడ్పీ కన్వెన్షన్ హాలు పరిసరాలంతా పారిశుధ్యం మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్వయం సహాయక సంఘాల మహిళలను భాగస్వామ్యం చేయాలన్నారు. వాణిజ్య పన్నులశాఖ సంయుక్త కమిషనర్ కల్పన, సహాయ కమిషనర్ సుబ్రహ్మణ్యం, పరిశ్రమలశాఖ జిల్లా అధికారి వెంకట్రావు, మెప్మా పీడీ సాయిబాబు, జిల్లా అగ్నిమాపక అధికారి ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారామ విగ్రహాల ప్రతిష్ఠోత్సవం



గ్రామస్తుల ఆధ్వర్యంలో రామాలయంలో యంత్ర స్థాపనతో విగ్రహాలు ఏర్పాటు



శోభాయమానంగా అలంకృతమైన లక్ష్మణ హనుమ సహిత సీతారామ విగ్రహాలు

గణపేశ్వరం(నాగాయలంక): తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి పథకం నుంచి థేపీ దేవదాయ ధర్మాదాయ శాఖ మంజూరు చేసిన రూ.10 లక్షల నిధులుతో గ్రామంలో ఆలయ అభివృద్ధి కమిటీచే నిర్మించిన శ్రీకోదండ రామాలయంలో సీతా సమేత శ్రీరామచంద్రమూర్తి పరివార దేవతల వాయు ప్రతిష్ఠా మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. విగ్రహాలకు శుక్రవారం రాత్రి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించిన తర్వాత విశేష పూజలు, విగ్రహాలకు అలంకరణ, అభిషేకాలు, ఆలయ ప్రదక్షిణలు జరిగాయి. అనంతరం సహస్ర ప్రతిష్ఠాచార్యులు దుర్భా హరిబాబు శాస్త్రి (తెనాలి), స్థానిక దుర్గమ్మ ఆలయ ప్రధానార్చకుడు పోతుకూచి సత్యనారాయణ శాస్త్రి నేతృత్వంలో విగ్రహాలకు విశేష ప్రతిష్ఠ, వాయు కల ఆవాహన, పూర్ణాహుతి, శాంతి కల్యాణం చేశారు. అనంతరం ఆలయ అభివృద్ధి కమిటి నేతృత్వంలో రెండు వేలమంది భక్తులకు మహా అన్నసంతర్పణ నిర్వహించారు. గణపేశ్వరం, బర్రంకుల పరిసరాల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చారు.

బుద్ధ ప్రాజెక్టు పూర్తి చేయాలని వినతి



ఘంటసాల బుద్ధ ప్రాజెక్టు నిర్మాణానికి సహకరించాలని కలెక్టర్ బాలాజీని కోరుతున్న రామకృష్ణ

ఘంటసాల: అసంపూర్తిగా నిలిచిపోయిన ఘంటసాల బుద్ధ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయడానికి తమవంతు సహకారం అందించాలని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ జిల్లా కలెక్టర్ డీకే బాలాజీని కోరారు. ఘంటసాల కేవీకేలో ప్రత్యేక కార్యక్రమానికి విచ్చేసిన కలెక్టర్ బాలజీని శనివారం కలిసి ప్రాజెక్టు గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఇటీవల బుద్ధ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రయత్నం చేస్తున్నారని, దీని పై అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే గుర్తుచేసినట్లు చెప్పారు. అవకాశం ఉంటే రూ.70 లక్షల నుంచి కోటి రూపాయలు మంజూరు చేస్తే స్థలం అందించిన దాత గొర్రెపాటి రంగనాథబాబు గొర్రెపాటి ట్రస్టు ద్వారా రూ. 10 నుంచి 20 లక్షలతో బుద్ధ ప్రాజెక్టుకు అవసరమైన బుద్ధుని విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నం చేస్తామని కలెక్టర్‌కు వివరించారు. ప్రాజెక్టు అసంపూర్తిగా మిగిలిపోవడం బాధ కలిగిస్తుందన్నారు. బుద్ధ ప్రాజెక్టు తన దృష్టిలో ఉందని నిధుల కోసం తన వంతు కృషి చేస్తున్నట్లు కలెక్టర్ బాలాజీ చెప్పారు.

భారీ అన్నసమారాధన

గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా స్వామిని దర్శించుకునేందుకు శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులకు భారీ అన్నసమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతులు ప్రారంభించారు. మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆర్థిక సాయంతో కార్యక్రమం జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

క్లుప్తంగా

సాంప్రదాయ డిజైన్లకు ఆదరణ



గూడూరు: ప్రకృతి సంబంధిత సాంప్రదాయ డిజైన్లకు మార్కెట్లో మంచి ఆదరణ ఉంటుందని కలంకారీ డిజైన్ ట్రైనర్ యక్కల పీతాంబరదరరావు అన్నారు. మండల పరిధిలోని కప్పలదొడ్డిలో వాసవ్య మహిళా మండలి, హెచ్‌సీఎల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొత్త రకాల డిజైన్లపై శనివారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆకు కొమ్మలతో సుందరమైన డిజైన్లు, ఫ్యాబ్రిక్‌పై రంగులు అద్దే విధానం గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలంకారి కళ అనేది గొప్ప చేతి వృత్తి అని చెప్పారు. దాన్ని చక్కగా నేర్చుకుని మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగవచ్చని తెలిపారు. ప్రతి రోజు సాధన చెయ్యడం వల్ల కొత్త కొత్త డిజైన్‌లు వేయాలనే ఆలోచన కలుగుతుంది పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాసవ్య మహిళా మండలి కోఆర్డినేటర్ లక్ష్మణ్, కలంకారీ కళాకారులు పాల్గొన్నారు.

వెంకటాపురంలో ఉపవాస ఉజ్జీవ పండుగలు



వెంకటాపురం(మోపిదేవి): సీయోను గాస్పెల్ మినిస్ట్రీస్ ప్రార్థనా మందిరంలో శనివారం సాయంత్రం ఉపవాస ఉజ్జీవ ప్రార్థన పండుగలు పాస్టర్ మహన్‌జాన్ నిర్వహించారు. బ్రదర్ మహన్‌జాన్ క్రీస్తు సందేశాన్ని, చక్కటి సువార్తను అందించారు. హెచ్‌జీఎం డైరెక్టర్ పాస్టర్ కె. యోహోన్‌బాబు మాట్లాడారు. ప్రభువు అందరికీ ప్రేమను, ఆరోగ్యాన్ని పంచుతారని తెలిపారు. అబ్బూరి విజయరాజు మాట్లాడుతూ మూడురోజుల పాటు ఉపవాస ఉజ్జీవ ప్రార్థనలు ప్రభువు ఆరాధనలో సాగుతున్నట్లు వివరించారు. పాస్టర్ ఇస్మాయేలు, పాస్టర్ కోట ప్రసాద్, పాస్టర్ షాలేము రాజు, పాస్టర్ లింగం ప్రసాద్, పాస్టర్ అబ్బూరి సీమోను, పాస్టర్ ఎం బాబూరావు, రూతమ్మ, బ్రదర్ పి మేరీస్ బాబు, సిస్టర్ పి శోబారాణి, మధు, కిషోర్ పెద్ద ఎత్తున దైవ సేవకులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గ్యార్మీ వేడుకలు



గూడూరు: గూడూరులోని హజ్రత్ పాలించే సాహెబ్ ఆస్తానాలో శనివారం భక్తి శ్రద్ధలతో గ్యార్మీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా హజ్రత్ గౌసే ఆజం దస్తగీర్ జీవిత చరిత్ర పుస్తక పఠనం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది. ఆస్థాన కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ జహంగీర్, నిర్గన్ షా, మన్నాన్, జమాల్ బేగ్, నూర్ లైన్, తదితరులు పాల్గొన్నారు.

13న క్యాన్సర్ మామోగ్రామ్ స్క్రీనింగ్ పరీక్షలు

చిలకలపూడి(మచిలీపట్నం): ఈ నెల 13వ తేదీ మీకోసం కార్యక్రమం సందర్భంగా కలెక్టరేట్‌లో రొమ్ము క్యాన్సర్, మామోగ్రామ్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించే కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ డీకే బాలాజీ శనివారం తెలిపారు. మచిలీపట్నం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి నుంచి ఇద్దరు ప్రత్యేక మహిళా వైద్యులు, రేడియాలజిస్టులు ఉచితంగా ఈ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. పరీక్షల అనంతరం స్క్రీనింగ్ నివేదికలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. ఈ అవకాశాన్ని మీకోసం కార్యక్రమానికి వచ్చే మహిళలు, కలెక్టరేట్‌లోని మహిళా ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక



గన్నవరం: ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు గన్నవరం చైతన్య స్పోర్ట్స్ క్లబ్ క్రీడాకారిణి పుట్టా కీర్తి ఎంపికైనట్లు శిక్షకులు ధనియాల నాగరాజు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7న మైలవరంలోని లకిరెడ్డి బాలిరెడ్డి డిగ్రీ కళాశాలలో కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రజత పతకం సాధించిన కీర్తి కృష్ణా యూనివర్శిటీ జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. పంజాబ్ రాష్ట్రం జలంధర్‌లో నవంబర్ 1, 2 తేదీల్లో జరగనున్న ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో కీర్తి పాల్గొంటుందన్నారు. వీకేఆర్ కళాశాలలో డిగ్రీ పథమ సంవత్సరం చదువుతున్న ఆమెను ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు, పలువురు అధ్యాపకులు అభినందించారు.